మధ్యాహ్నం మహాలక్ష్మమ్మ మడత మంచంమీద కూర్చుంది ఏకాంతంగా! రోజూ ఆవేళప్పుడు అలానే కూర్చుంటుంది ఏమీ తోచక.

# అనుబంధం

## ఆచంట శారదాదేవి




పని అంతా ముగించుకుని పని మనిషి పన్నెండు గంటలకల్లా వెళ్ళిపోతుంది. మళ్ళా నాలుగు గంటలకు వస్తుంది. ఆ తరువాత అంతా వస్తారు. ఒక్కరొక్కరే!

కొడుకూ, కోడలూ, మనమడు, మనమరాలు. అప్పుడూ ఏకాంతమే! మరొక రకంగా అందరూ అలసిపోయి ఉంటారు. ఎవరి పనుల్లో వాళ్ళు ఉంటారు. మహలక్ష్మమ్మతో మాట్లాడే ఓపిక ఎవరికీ ఉండదు. కాకపోతే మడతమంచం మీద నుంచి లేచివచ్చి వరాండాలో కూర్చుని ఇంట్లో అందరినీ ఓపిగ్గా చూస్తూ ఉంటుంది ఏదో సినిమా చూసినట్లు. చీకటిపడితే కాసిని పాలు తాగి మళ్ళా మడతమంచం మీదకు చేరుతుంది. అది తనకు ప్రియమైనది.

పట్నంలో కొడుకు సుందరం ఏదో కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కోడలు సుమతి బ్యాంకులో అక్కౌంటెంట్‌గా పనిచేస్తోంది. మనమడు శేఖరం, మనమరాలు కమల కాలేజీలో చదువుకుంటున్నారు.

ఈ ఊరు వచ్చి అప్పుడే పన్నెండేళ్ళయింది. ఈ మహా పట్నంలో సుందరానికి దొరికింది ఈ సందులో మేడ మీద భాగం. అదే రాజభవనం. ఒకరికన్నా ఎక్కువ పట్టని సన్నని మెట్లు. ముగ్గురికన్నా ఎక్కువ పట్టని చిన్న వరాండా! అందులోనే ఓ చిన్న కొయ్య అడ్డం పెడితే




అవతలవేపు ఓ మడతమంచం, ఓ చిన్న బల్లమీద ఓ చిన్న పెట్టె. అది మహాలక్ష్మమ్మ సంసారం. అదే ఆమెకు పెన్నిధి.

ఆ వరాండాకు అవతల ఓ గదీ. అందులో నాలుగు కుర్చీలు, ఓ రేడియో. అది డ్రాయింగు రూము. సాయంత్రం పిల్లలకు స్టడీ రూము. రాత్రికి అందరికీ బెడ్ రూము. ఎప్పుడైనా ఎవరయినా వస్తే గెస్టురూము. ఆ వెనకాల మళ్ళా ఓ చిన్న వరాండా, ఓ చిన్న వంట ఇల్లు, బాత్ రూము. ముందు వరాండాలో కూర్చుంటే ఇల్లంతా కనబడుతూ ఉంటుంది.

పగలంతా ఇంట్లో ఎవరూ ఉండరు గనుక సరిపోతోంది. కోడలు మనిషి మంచిదే. ఎక్కువ మాట్లాడదు. అటు ఆఫీసు పని, ఇటు ఇంట్లో పని ఓపిగ్గా సర్దుకుంటూ ఉంటుంది. పనిమనిషి రాజ్యలక్ష్మి మంచిదే. మాటా పలుకూ లేకుండా సర్దుకుపోతూ ఉంటుంది.

మహాలక్ష్మమ్మకు భర్త వున్నన్నాళ్ళూ ఆయన సేవ సరిపోతూ ఉండేది. ఇప్పుడు ఆయన పోయాక ఒకరకంగా ఒంటరితనం. కొడుకు, కోడలూ అందరూ ఉన్నా ఎవరితోవ వాళ్ళది.

మహాలక్ష్మమ్మ ఎప్పుడూ తలదిండు క్రింద 'కాత్యాయని' పుస్తకం పెట్టుకుంటుంది. అది ఎప్పుడో ఏభై ఏళ్ళ క్రిందట కొనుక్కుంది. కాస్త చివిగినా, కాస్త ఇంకా బాగానే ఉంది. పై అట్టమాత్రం ఊడిపోయింది.

ఆ వేళ కార్తీక పూర్ణిమ. అమ్మతో గోదావరి స్నానానికి వెళ్ళింది. తడి బట్టలతో తిరిగి వస్తుంటే తోవలో ఒకతను బల్లనిండా పుస్తకాలు పేర్చి అమ్ముతున్నాడు. అంతే. తను అలాగే పుస్తకాలు చూస్తూ అక్కడ నిలబడిపోయింది. ఆ రోజుల్లో తనకు పుస్తకాలంటే చాలా పిచ్చి. ఏ కథల పుస్తకం దొరికినా ఏ మూలో కూర్చుని చదువుతూ ఉండేది. అప్పుడు ఆ పల్లెటూళ్ళో తమ ఇల్లు చాలా పెద్దది. చుట్టూ పెద్ద తోట. మేడమీద గదులు. పెద్ద పెద్ద వరండాలు. ఏ మూల ఎక్కడ కూర్చుని చదువుకున్నా ఎవరికీ తెలియదు.

అప్పట్లో వచ్చే కథలన్నీ వేరు. రాజకుమార్తెలు, రాజ కుమారులు, ఉద్యానవనాలు, అదొక లోకం. తాను ఆ లోకంలో నుంచి ఈ లోకంలోకి ఎప్పుడోగాని బయటికి వచ్చేదికాదు. ఆ ఊహాలోకంలో అలవాటుఅయితే తమ ఇల్లు రాజమందిరం లాగా, తమ తోట ఉద్యానవనంగా, అక్కడ ఎగిరే పిట్టలే కలహంసలుగా కలలుకంటూ ఉండేది. ఎప్పుడూ ఎవరూ తనకు ఏ పనీ చెప్పేవారు కాదు.

ఆవేళ బల్లదగ్గర నిలబడి పుస్తకాలలో లీనమయిపోతే, అమ్మ మళ్ళా వెనక్కు తనను వెతుక్కుంటూ వచ్చింది. అన్ని పుస్తకాలలోకి 'కాత్యాయని' ఆకర్షణీయంగా కనిపించింది. ఆ పుస్తకం కొంటేగాని రానని తను మారాం చేసింది. అమ్మ కొన్నది. ఆవిడకు చదువు రాదు. తను చదువుతే ఎప్పుడైనా ఓపికవుంటే వింటూ ఉండేది, లేకపోతే లేదు.

ఆ వేళ అలా తెచ్చుకుంది ఆ పుస్తకం. ఇంటికి రాగానే సాయంత్రంలోపల చదివి ముగించింది. ఆ కథ చాలా బాగుంది. కాత్యాయని ఒక రాజకుమార్తె. చిన్నప్పుడే ఆమెను దొంగలుఎత్తుకుపోయారు. అక్కడ అడివిలో పెరిగింది. అక్కడ ఒక రాజకుమారుడితో పరిచయమైంది. అతన్ని వరించింది. అతని సహాయంతో దొంగలముఠాలో నుంచి బయటపడ్డది. ఆపదలో ఉన్న తన తండ్రిని కాపాడింది. రాజకుమారుణ్ని పెళ్ళాడింది. ఇంకా మధ్య మధ్యలో ఎన్ని కష్టాలో! అయినా ఎంత ధైర్యం! ఏమీ చలించలేదు. ఆ నవల మహాలక్ష్మమ్మ పదిసార్లు చదివింది. మళ్ళా మళ్ళా చదివింది. ఇప్పుడు చరమదశలో కూడా ఆ పుస్తకం తనకు తోడు-నీడ. ఎప్పుడూ తలకిందే ఉంటుంది. ఏమీ తోచకపోతే ఓసారి తీసి నాలుగుపంక్తులు చదువుతుంది. మళ్ళా దాచుకుంటుంది.

ఆ వేళ ఇంటికి వచ్చాక తెలిసింది. ఆ పుస్తకం రాసిన ఆయన పేరు 'తారాచంద్' అని. ఆయన ఇంకా చాలా నవలు, కథలు రాశాడు అని. ఆ లిస్టు అంతా పుస్తకం వెనకాల రాసి ఉంది. మహాలక్ష్మమ్మకు అవన్నీ చదవాలనిపించింది. ఆ పుస్తకాల కోసం వేట ప్రారంభించింది. అక్కడా అక్కడా అడగ్గా అడగ్గా చాలా పుస్తకాలు దొరికాయి. అవన్నీ చదవగా చదవగా ఆ తారాచంద్ తనకు చాలా సన్నిహితమైన ట్లనిపించింది. రాత్రి, పగలు అతని పుస్తకాల గురించి, అతను సృష్టించిన పాత్రల గురించి, అతని కథలను గురించి, అతన్ని గురించి ఇవే ఆలోచనలు. అతన్ని ఒకసారిచూస్తే బాగుండును. అతను ఇంకా ఏవైనా కథలు రాశాడేమో ఒకసారిఅడిగితే బాగుండును. ఇల్లాంటి ఆలోచనలు అప్పుడప్పుడూ వచ్చి మళ్ళా మాయమవుతూ ఉండేవి.

మహాలక్ష్మమ్మ ఎక్కువచదువుకోలేదు. ఆమె నెవరూ బడికి పంపించి చదివించలేదు. ఆమె తాతగారు మంచి తెలుగు పండితుడు. ఆయన ఓపిగ్గా మహాలక్ష్మమ్మను దగ్గర కూర్చోబెట్టుకుని కాస్త చదువునేర్పాడు. కొన్ని తెలుగు పుస్తకాలు

చదివించాడు. కొన్ని ఆవిడ అక్కడా అక్కడా తెచ్చుకుని చదివింది. అంచేత ఆవిడకు తను చదివిన కథల్లో, పుస్తకాల్లో తారాచంద్ కథలు పుస్తకాలే ఎక్కువ వచ్చాయి. అంతకన్నా మంచి పుస్తకాలు ఉండవచ్చునన్న ఆలోచన ఆవిడకు ఎప్పుడూ రాలేదు. తన కల్పనలకు, ఊహలకు తారాచంద్ కథలు దీపం పెట్టాయి. ఆ రచయితమీద ఒక అవ్యక్తమైన అభిమానం, అనురాగం గుండెల్లో గూడు చేసుకున్నాయి. ఆ ఆప్యాయతను ఇంతవరకు భద్రంగా దాచుకుంది.

ఆ రచయితను చూడాలన్న కోరిక అప్పుడప్పుడూ వస్తూనే ఉంది. మళ్ళా మరుగుపడుతూనే ఉంది. చిన్నప్పుడు ఒకసారి తల్లినడిగింది. 'కాత్యాయని' నవల రాసిన తారాచంద్‌గారిని ఒకసారి చూసి వస్తానని. ఆవిడ విసుక్కుంది. "అవ్వాళ పెళ్ళివారు వస్తూఉంటే, అయన్నెవరినో చూడాలంటావేమిటి? ముందుతలదువ్వుకో" అంది. ఆవిడ మాటలు మహాలక్ష్మమ్మకు సబబుగానే తోచాయి. ఆవేళ తనను చూడటానికి పెళ్ళివారు వస్తున్నారు. ఇల్లంతా సందడిగా ఉంది తనకూ సంతోషంగానే ఉంది. పట్టు పరికిణీ కట్టడం, సింగారించడం అన్నీ- అసలు నిజానికి ఆ తారాచంద్ ఎక్కడ ఉన్నాడో తనకు తెలియదు. ఎవరో చెప్పారు. ఏదో ఊళ్ళో ఉన్నాడని. ఎవరినైనా వెంటబెట్టుకుని వెళ్ళి వెదకాలి. ఇది అయ్యేపని కాదని మాట్లాడక ఊరుకుంది.

సంబంధం కుదిరి పెళ్ళయిపోయింది. అత్తవారింటికి వెళ్ళింది. అక్కడ పెద్ద సంసారం, అత్తగారు, మామగారు, బావలు, వదినెలు, తోడికోడళ్ళు. సందడిగా కాలం గడుస్తోంది. పుస్తకాలు చదవటానికి తీరిక లేదు. 'కాత్యాయని' పుస్తకం మాత్రం కూడా తెచ్చుకుంది. పెట్టెలో దాచుకుంది. ఎప్పుడైనా బట్టలు సర్దుకునేటప్పుడు ఒకసారి తీసి చూసుకునేది. మళ్ళా భద్రంగా దాచుకునేది. అలా రోజులు గడిచాయి.

కొంచం స్థిరపడ్డాక ఆ పుస్తకం భర్తకు చూపించింది. అతన్ని చదవమంది అతను చదవలేదు. తనకు ఆ రచయిత అంటే చాలా ఇష్టమని చెప్పింది. అతను విని పించుకోలేదు. "ఆ రచయిత అదేదో ఊళ్ళో ఉన్నాడట. ఒకసారి వెళ్ళి చూద్దామా?" అని అడిగింది. అప్పుడు అతను సమాధానం చెప్పాడు. "నీకేమైనా మతిపోయిందా?" అన్నాడు. అంతే. ఆ తరువాత మహాలక్ష్మమ్మ మళ్ళా ఆ ప్రస్తావన తేలేదు.

మహాలక్ష్మమ్మ పెద్దదయింది. జుట్టు నెరిసింది. ఓపిక తగ్గింది. కొడుకు కాపురంలో అతిథి అయింది. అయినా మనసులో మమకారం పోలేదు. పెట్టెలోవున్న 'కాత్యాయని' పుస్తకం తలక్రిందకు చేరింది తోడునీడగా. తనకు ఇష్టమైన వ్యక్తిని చూడాలన్న తపన, తపనగానే మిగిలింది.

ఒక రోజు కొడుకు కాస్త తీరిగ్గా పేపరు చదువుకుంటూ ఉంటే ధైర్యంగా దగ్గరకు వెళ్ళి కూర్చుని అడిగింది. "ఒరే




*With Best Compliments from:*

**EAST INDIA COMMERCIAL COMPANY PRIVATE LIMITED**

**LESSEE: SRI KRISHNA JUTE MILLS, ELURU-534 002 (A.P.)**

MANUFACTURERS OF All Varieties of Jute Gunny Bags Including D. W. Flour Bags, Cement Bags, B. Twill Bags and A. Twill Bags and Manufacturers of "KRISHNA" Brand Jute Twine in all Plys and Jute Yarn in Spools & Cops.

Telegrams: "TWINKLE" SOUNDY VIA

Telephones: 37 & 441
PMBX: 1122 (5 Lines)

అబ్బాయి, నా చిన్నతనంలో తారాచంద్ గారని ఒకాయన కథలు రాస్తూ ఉండేవాడు. ఆయన రాజమండ్రి దగ్గర ఏదో పల్లెటూరులో ఉంటాడని అప్పట్లో అనుకునేవారు. ఒకసారి వెళ్ళి చూసి రావాలని ఉంది" అంది. కొడుకు ఎక్కువ మాట్లాడలేదు. "నీకు ఇప్పుడు ప్రయాణాలు చేసే ఓపిక లేదు కదమ్మా!" అన్నాడు. అంతే! ఆ మాటతో అక్కడి నించి లేచి వెళ్ళిపోయాడు. అతడు ఖాళీ చేసి వెళ్ళిన సోఫాలో మహాలక్ష్మమ్మ ఒక్కత్తే కూర్చుంది కాస్సేపు మళ్ళా తన మడత మంచం దగ్గరికి వెళ్ళిపోయింది.

తారాచందు కథలు రాయడం మానేసి చాలా రోజులయింది. ఆయన కథలు అందరూ చదవడం మానేసి కూడా చాలా రోజులయింది. అంచేత ఆ ఇంట్లో మహాలక్ష్మమ్మకు తప్ప అతని పేరు ఇంకెవరికీ తెలియదు. ఇంకెవరికీ ఆ విషయం పట్టదు. పనిమనిషి రాజ్యలక్ష్మి మాత్రం ఎప్పుడైనా పక్క దులిపినప్పుడల్లా "ఈ పుస్తకం ఎందుకమ్మా? ఎప్పుడూ తల కింద!" అంటుంది. అంతే! మళ్ళా అక్కడే పెట్టేస్తుంది.

ఆ పుస్తకంలో ఒక వ్యక్తి ఉన్నాడని, అతను తనకు తోడునీడగా ఉన్నాడని దానికేం తెలుసు! తను అతన్ని గురించి ఊహించుకుంటూనే కాలం గడుపుతోందని దానికి చెప్పినా తెలియకపోవచ్చు.

తనకు ఎన్నో రకాల ఆలోచనలు! తారాచంద్ ఎలా ఉంటాడు? నలుపా? తెలుపా! మంచి మనిషయి ఉండాలి. అతని రూపాన్ని ఒక రకంగా ఊహించుకుంది. గిరజాల జుట్టు, కళ్ళద్దాలు, ఖద్దరు కండువా! ఇలా ఏదో కల్పన! ఎప్పుడో ఎవరినో చూసి ఆ రూపంలో తన కల్పనకు ప్రాణం పోసిందేమో! ఇంకా ఎన్నో రకరకాల ఊహలు, ఆలోచనలు. అతని భార్యా పిల్లలు ఎలా ఉంటారు? అతను భాగ్యవంతుడేనా? ఆ పల్లెలో ఏం చేస్తూ ఉంటాడు? ఈ ప్రశ్నలకు దేనికీ సమాధానం దొరకదు. ఊరికే ఆలోచనలు, ఊహలు. వీటితోనే అతను ఆమెకు సన్నిహితమయ్యాడు.

ఆవేళ రాజ్యలక్ష్మి బజారు నించి సామాన్లు తెచ్చి అన్నీ డబ్బాల్లో పోసి పొట్లాలు విప్పిన కాగితాలన్నీ మడిచి ఓ మూల పెట్టింది. అందులో ఓ కాగితం తెలుగుపేపరులా కనిపిస్తే మహాలక్ష్మమ్మ ఏమిటోనని తీసి చూసింది. ఆ కాగితం సగం చినిగిపోయి ఉంది. తేదీ లేదు. అందులో చివర ఓ మూల ఓ చిన్న వార్త ఉంది. "కథా రచయిత తారాచంద్ తన స్వగ్రామంలో స్వర్గస్థులయినారు. ఆయన కొంత కాలంగా అస్వస్థులుగా వున్నారు. ఆయన కథలు ఒకప్పుడు విశేషంగా ప్రజాదరణ పొందాయి."

మూడే వాక్యాలు వున్నాయి! మూడూ మూడు ముళ్ళలా గుండెల్లో గుచ్చుకున్నాయి. ఒక వ్యక్తిని చూడాలని విపరీతంగా తపన పడింది. ఆ కోరిక తీరనే లేదు. తనకు ఆప్తబంధువు పోయినట్లు విపరీతంగా బాధగా ఉంది. ఏమీ తోచలేదు. ఒక్కసారిగా శూన్యం కమ్ముకున్నట్లుంది. దిగాలుపడి కూర్చుంది.

సాయంత్రం అందరూరాగానే ఒక్కొక్కరికీ చెప్పింది తాను చదివిన వార్త. ఎవరికీ ఏమీ పట్టలేదు. వాళ్ళలోకం వేరు. రోజులుమారాయి. అభిరుచులు మారాయి ఆలోచనలు మారాయి.

కొడుకు ఏదో మీటింగు ఉందని వెళ్ళిపోయాడు. కోడలు బ్యాంకులో ఏదో లెక్క తేడా వచ్చిందని దిగులుపడుతూ కూర్చుంది. మనవడు,మనవరాలు పేకాడుకుంటూ కూర్చున్నారు. రాజ్యలక్ష్మి వంట చేసి ఏదో పనుందని వెళ్ళిపోయింది. ఎవరూ మహాలక్ష్మమ్మతో మాట్లాడలేదు. ఆమెను ఓదార్చలేదు. అసలు ఆమెను ఓదార్చవలసిన అవసరం వుందని వాళ్ళకెవరికీ తోచలేదు.

మళ్ళా మడత మంచం, మళ్ళా ఏకాంతం. తనకోసం ఒక అజ్ఞాతవ్యక్తి దుఃఖపడుతోందని తెలిస్తే అతని ఆత్మకు శాంతి కలుగుతుందా? ఏమో! తనకు ఆ గదిలో ఆ అపరిచితవ్యక్తి అక్కడే ఉన్నట్లనిపిస్తోంది. ఇప్పుడూ ఒంటరిగా ఉన్నట్లనిపించడంలేదు.

మళ్ళా 'కాత్యాయని' పుస్తకం తెరిచి మళ్ళా నాలుగు వాక్యాలు చదువుకుంది. మళ్ళా భద్రంగా దాచుకుంది. ఇదొక పెన్నిధి. ఎవరికీ అందనిది. ఆమె మనసు తృప్తితో నిండింది.